

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# నాడీ వైద్యుడు

**ఆరోజు** సాయంత్రం నేనాఫీసునుంచి ఆలస్యంగా ఇంటికొచ్చేసరికి మా బురుజువీధి సంక్షేమసంఘం ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి, ముగ్గరు ఇతర సభ్యులు మాయింట్లో కూర్చుని మా ఆవిడ కామేశ్వరితో ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. నిజానికి మా సంక్షేమ సంఘానికి మావీధిలోని ఆధునికభావాలున్న కామేశ్వరిలాంటి ఆడవాళ్లంటే కోపం. కామేశ్వరికీ మాసంఘపెద్దలంటే పడదు. వాళ్లు ధర్మరక్షణపేరుతో వాళ్లకనుకూలమైన చాందసభావాల్ని మామీద రుద్దుతున్నారంటుంది. ఐతే సంఘసభ్యులపట్ల నాకు గౌరవం. ఈవిషయంలో నాకు కామేశ్వరికి అప్పుడప్పుడూ వాదోపవాదాలు జరుగుతూంటాయి.

'ఊరకరారు మహాత్ములు' అనుకున్నా. మూర్తి, స్వామినాయుడు, మునిరెడ్డి, రంగశాయి బిజీమనుషులు. ఊరకే వచ్చి వాళ్ల విలువైన సమయాన్ని వృధాచేయరు.

"నీతో వొక ముఖ్యమైన పనుండి వొచ్చామోయ్ సూర్యం" అన్నాడు మూర్తి.

"దానికింతశ్రమ తీసుకోవాలా, ఐనా మీర్రావడం సంతోషం, చెప్పండేంచెయ్యాలో" అన్నా అయన పక్కన కూర్చుంటూ.

ఆయన నాక్కొంచెం దగ్గరగా జరిగి "యిది అందరికీ చెప్పేవిషయంగాదు. మన సంఘ అధ్యక్షుడు రాయుడుగారి విషయం. వారి చిన్నమరదలు మణిప్రభాదేవిగారు బెంగుళూర్లో వుంటారు తెల్సుగా. ఆమెకు గత యిరవైరోజులుగా నూట్రొండు జ్వరం. అన్నిటెస్టులూ చేసారు, యెక్కడా యేమీ తెలియలేదు. వొకరిద్దరు డాక్టర్లు యేవో మందులు యిస్తున్నారు కానీ ఫలితం లేదు. మనిషి నీరసించిపోతూంది. రాయుడుగారికి, వారిశ్రీమతిగారికి కాళ్లూచేతులూ ఆడ్డంలేదు" అని రహస్యం చెప్పినట్టుగా చెప్పాడు.

"అయ్యో అలాగా. విదేశాలకు తీసుకెళ్లచ్చుగా, వారికేం తక్కువ" అన్నా, ఇది నాకెందుకు చెప్తున్నారో బోధపడక.

"అక్కడివాళ్లనీ సంప్రతించారు. విమానప్రయాణం చెయ్యకూడదన్నారట. టెస్టుల్లో యేదైనా తెలిస్తేగాని వాళ్లైనా యేంచెయ్యగలరు? ఐనా యిక తప్పకపోతే విదేశాలనుంచి డాక్టర్లనైనా రప్పించాలనుకుంటున్నారట" చెప్పాడు స్వామినాయుడు.

"యింతకీ యిందులో నేను చేయాల్సిందేమిటి" అనడిగాను.

"నువ్వు రేపే మన డాక్టరు రామస్వామి వూరెళ్లి అతన్ని యీామెకు చికిత్స చేయడానికొప్పించి మన రాయుడుగారింటికి తీసుకొస్తే ఆటైముకు ఆమెను కార్లో బెంగుళూరునుంచి తీసుకొస్తారు" అన్నాడు నారాయణమూర్తి.

నేను నిర్ఘాంతపోయాను. ఇది దాదాపు అసాధ్యం. "రామస్వామి వస్తాడా?" అన్నా.

“అది చాలాకష్టమైన పని. మాకూ తెలుసు. కానీ తప్పడంలేదు. రాయుడుగారు మనందరికీ తండ్రిలాంటివాడు. మనమెట్లాగైనా చెయ్యకతప్పదు. నువ్వు రామస్వామికి దగ్గరస్నేహితుడివి, నీమాటవింటాడు" అన్నాడు మునిరెడ్డి బతిమాలుతున్నట్టుగా.

"బెంగుళూరు డాక్టర్లవల్లే కానిది యితనేం చికిత్స చేస్తాడు?" అనడిగాను.

"ఆమె విషయంలో టెస్టులేవీ పనికిరావడంలేదు కాబట్టి యే పరికరం లేకుండా మనిషిని పరీక్షించి యెలాంటి జబ్బునైనా తెల్సుకోగలిగిన డాక్టరుమాత్రమే ఆమెకు నయంజెయ్యగలడని చెప్పారంట. మనకుతెల్సీ అలాంటోడు రామస్వామొక్కడేగదా" అన్నాడు రంగశాయి.

ఇది నాకు వింతగా కనపపడినా వాళ్లు కోరినట్టుగా చెయ్యక తప్పదనిపించింది. "సరే, మీరింత చెప్తున్నారుగాబట్టి రేప్పొద్దున వెళ్లి రామస్వామిని కల్సి నాప్రయత్నం చేస్తా, కానీ ఆయన్ను తీసుకొస్తానని గ్యారెంటి యివ్వలేను" అన్నాను.

“నువ్వెళ్తే ఆయనొస్తాడు. కావాలంటే చలపతినికూడా తీసుకెళ్లు, అతనికీ చెప్తాను. రాయుడిగారికి నువ్వుచేస్తున్న సాయం యెప్పటికీ గుర్తుంటుంది. యెక్కువ టైంలేదు. పొద్దున్నే ట్యాక్సీలో వెళ్లు" అని నా భుజంతట్టి “మరోమాట, వాళ్లు జమిందారీ వారసులు, ఘోషావుంటుంది" అని అదెలావుంటుందో గొంతు తగ్గించి చెప్పాడు మూర్తి.

కాస్సేపు తరువాత ‘ఇది రహస్యమని’ మరోసారి చెప్పి నలుగురు వెళ్లిపోయారు.

“డాక్టర్ రామస్వామి యిదివరకు కొన్నాళ్లీవీధిలో ప్రాక్టీసు చేసాడని విన్నానుగాని వివరాలు తెలియవు. మీ సంఘపెద్దలు పిలిస్తే ఆయనెందుకు రాడు? నాకు వద్దనుకున్నా వంటింట్లోకి మీమాటలు వినబడ్డాయి. యిది చాలాపెద్దవాళ్ల విషయంకాబట్టి మా ‘వార్తల వనజమ్మ’కు అందేదికాదు. యింతకీ యెవరాడాక్టరు?" అంది కామేశ్వరి, పడుకునేముందు.

"అప్పటికి మన పెళ్లై తమరింకా వేంచేయలేదు. మనవీధిలో రాయుడుగారిమేడ పక్కన వారిదే పెంకుటిల్లుందిగదా, రామస్వామి అందులోవుండి డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూండేవాడు. పదహైదేళ్లకిందట వెళ్లిపోయాడు. యిప్పుడతను వాళ్లస్వంతవూర్లో ఉన్నాడు. అతనిదొక చిత్రమైన కథ" అన్నా.

"మీ సంఘపెద్దలకు అతనితో పనిబడి, వాళ్లెవరు వెళ్లకుండా నిన్ను పంపిస్తున్నారంటే ఆకథ చిత్రమైందేవుంటుంది, చెప్పు" అంది. చెప్పడం ప్రారంభించాను.

"రామస్వామిది యీవూరికి అటువైపు పదిమైళ్లవతల కొండలకిందున్న కుగ్రామం. పేదస్థితి, తండ్రి చిన్నప్పుడే పోయాడు. తల్లి సరోజమ్మ నానాచాకిరిచేసి చదివించింది. అతను చదువులో బృహస్పతి. యెంబిబియెస్ లో సీటొచ్చినప్పుడు వూళ్లోవాళ్లంతా తలావొక చెయ్యేసి చదివించారు. అతను డాక్టరు అయ్యాకాగానే సరోజమ్మకు పెద్ద జబ్బుచేసి మంచంపట్టింది. అన్నేళ్లు బిగువుగా పట్టుకున్న ఆమెవోపిక వొక్కసారి సడలిపోయిందన్నారు. రామస్వామి

స్వంతవూరొచ్చేసి మూణ్ణెల్లు కష్టపడి తల్లికి నయంచేసి, వుద్యోగమనుకోకుండా మరోనాలుగేళ్లు అక్కడివాళ్లకు, కొండల్లోవున్న ఆదివాసిలకు వైద్యం చేస్తూ స్వంతవూళ్లోనే వుండిపోయాడు. పెళ్లైయ్యాక కుటుంబంతో యీవూరొచ్చి మనవీధిలో బురుజువైపు వరసలో నదివొడ్డునున్న రాయుడిగారి బంగళా పక్కనున్న పెంకుటిల్లు అద్దెకు తీసుకుని ప్రాక్టీసుపెట్టాడు. అదీ రాయుడు గారిదే. పూర్వమున్న జమీందారు ఆయనకోసం వచ్చేవాళ్లుండడానికి కట్టించుకున్నాడు" అని ఆగాను.

“తరువాత?” అంది కామేశ్వరి మంచంమీద లేచి కూర్చొని.

“మొదట్లో రాయుడుగారు, మనవీధి సంఘపెద్దలు అతనికి తోడ్పాటిచ్చారు. యెందుకంటే అంతకుముందే మనవీధిలోవుండిన డాక్టరు కృష్ణారావు బజారుకవతల కాలనీలో స్వంత నర్సింగ్ హోం కట్టుకొని వెళ్లిపోయాడు. యితను కొత్తగా వచ్చాడు, పైగా పేదడాక్టరు. వాళ్లనుకున్నట్టే అతనుకూడా వాళ్లయిళ్లకెళ్లి వుచితంగా వైద్యం చేసేవాడు. అతను మనవీధిలో డాక్టరుగా కుదురుకున్నాక ఆస్పత్రి ఖర్చీచరుకోసం బ్యాంకు లోనుకు అవసరమయ్యి ఆయింటిని ఐదేళ్లకు అద్దెకుతీసుకుని రాయుడిగారితో అగ్రిమెంటు రాసుకున్నాడు. రెండేళ్లు బాగానే గడిచింది. ఆతరువాతే పేచీ మొదలైంది" అన్నాను.

"అదే యింకా పేచీ రాలేదేమిటా అనుకుంటున్నాను. మీ సంఘపెద్దలు సామాన్యులా మరి, సరే, యింతకూ యేమిటి పేచీ?" అంది.

"రామస్వామికి తొందరర్లోనే మంచిపేరొచ్చింది. చుట్టుపక్కలనుంచి రోగులు పెద్దసంఖ్యలో వచ్చేవాళ్లు. వాళ్లల్లో చాలామంది నిరుపేదలు, రామస్వామి ఫీజడిగేవాడు కాదు, యిస్తే తీసుకునేవాడు లేకపోతేలేదు. అతని పెంకుటింటిముందు రాత్రి, పగలు గుంపులుగా వుండే రోగులతో, యెద్దుబళ్లతో యీవీధి స్వరూపమే మారింది. రామస్వామి బిజీ ఐపోయి వీధిలోని పెద్దలకు యింటికెళ్లి వైద్యంచెయ్యడం మానేసాడు.

యిది మన సంక్షేమసంఘ పెద్దలకు నచ్చలేదు. వీధిలోకి యెవరంటే వాళ్లొస్తున్నారని, దొంగతనాలు పెరుగుతాయని, వ్యాధులతో వచ్చేజనంతో తమక్కూడా జబ్బులొస్తాయని గొడవచేసారు. రామస్వామిని పిలిచి అధికఫీజులు వసూలుచెయ్యమని, రోగుల్ని తగ్గించుకోమని నచ్చజెప్పారు. అతను వినలేదు. యిలా మరోసంవత్సరం గడిచింది. అతన్ని యిల్లు ఖాళీచేయించమని రాయుడుగారిమీద వొత్తిడి తెచ్చారు. రాయుడిగారి భార్య జబ్బు అతనివైద్యంతో బాగవడంతో ఆయన గట్టిగా చెప్పలేకపోయాడు. కానీ రామస్వామి తీరు ఆయనకూ నచ్చలేదు. చివరికి వొకరోజు యిల్లు ఖాళీచెయ్యమని చెప్పాడు. రామస్వామి పట్టించుకోలేదు, అగ్రిమెంటు చూపించాడు. వూళ్లో రాయుడుగారి పరువుపోయే పరిస్థితివచ్చింది”.

“మరాయన వూరుకున్నాడా? వూరుకున్నా మీ యితరపెద్దలు నిద్రపోనీరుగదా? అసలే ఆయనది జమిందారీ వారసత్వం, వుంటున్నది పాత జమిందారుగారి మేడలో” అంది.

“వోపిగ్గా విను. ఆ తరువాతనుంచి రామస్వామికి, అతనిదగ్గరికొచ్చే రోగులకి పరోక్షంగా యిబ్బందులు మొదలయ్యాయి. కుటుంబసభ్యులమీద వొత్తిడి పెరిగింది. వొకరాత్రి రామస్వామికుటుంబం వూర్లోలేని సమయంలో కొందరు యింట్లోదూరి ఫర్నీచరు, పరికరాలు, మందులు అన్నీ చప్పుడుకాకుండా ధ్వంసంచేసి వెళ్లిపోయారు. రామస్వామి యెవరికో చేసిన వైద్యం వికటించి వాళ్లచుట్టాలు అతన్ని చంపడానికొచ్చారని వొకవదంతి పుట్టింది. దాంతో అతని తల్లి, భార్య భయపడి అతన్ని బలవంతంగా వొప్పించి యిక్కడ ఖాళీచేయించి వాళ్లస్వంతవూరికి తీసుకెళ్లిపోయారు”.

"యిది ఖచ్చితంగా రాయుడిదో లేక మీ సంఘపెద్దలపనో అయ్యుంటుంది"

“సాక్ష్యాధారాలు లేకుండా యెట్లాచెప్తాం? పైగా రాయుడుగారు, మా సంఘంవాళ్లు పోలీసు రిపోర్టిద్దామని, తాము తమ పరపతివుపయోగించి దౌర్జన్యం చేసినవాళ్లని పట్టుకునేట్టు చేస్తామని ముందుకొచ్చారు" అన్నా.

కామేశ్వరి పకపకా నవ్వి "పోన్లే, తరువాతేమైందో చెప్పు" అంది.

“యింక చెప్పేదేముంది, కథ ఐపోయింది. పదిహేనేళ్లనుంచి రామస్వామి స్వంతవూర్లోనే ప్రాక్టీసు చేస్తున్నాడు. కొండప్రాంతంలో యెంతోసేవ చేస్తున్నాడు. యిద్దరు పిల్లలు పుట్టి స్కూల్లో చదువుకుంటున్నారు. సరోజమ్మ పోయింది” అన్నాఆవలిస్తూ.

"అదంతా సరే, యింకెవరూ లేనట్టు, కోరి యిప్పుడతన్నే యెందుకు పిలుస్తున్నారు?" అంది అలాగే కూర్చుని.

నేనూ లేచి కూర్చున్నాను "రామస్వామి బుద్ధి అతిసూక్ష్మం అనిమొదట్లో చెప్పానుగా. అతను చదువైపోయి వొచ్చి వాళ్లవూర్లోనే ప్రాక్టీసు పెట్టాక అతనికి కనీసపరికరాలు తప్ప మరేమీ కొనడానికి డబ్బుల్లేవు. ఆచుట్టుపక్కల ల్యాబులు గట్రాలేమీ అప్పటికి రాలేదు. కాబట్టి అతను ప్రత్యేకశ్రద్ధతో కేవలం రోగిలక్షణాలనుబట్టి రోగాన్ని నిర్ధారించే పురాతన విధానాన్ని వొక పరిశోధనాస్థాయిలో పరిశీలించి అందులో నిష్ణాతుడయ్యాడు. దానికితోడు అతనికేదో యింట్యూషన్ లాంటిదికూడా వుందని కొందరనేవాళ్లు" అన్నాను.

"యిదెలా చెప్పగలవు? సాక్ష్యాలేమున్నాయి?" అంది.

"అతనిక్కడ ప్రాక్టీసుపెట్టిన తొలిరోజుల్లోనే మేమిద్దరం మంచి మిత్రులయ్యాం. అతనికి రోగులంతగా లేనప్పుడు మేం కలసితిరిగేవాళ్లం. నాకు ప్రత్యక్షంగా తెలిసే కొన్ని సంఘటనలు జరిగాయి, చెప్తావిను" అని మంచినీళ్ల తాగి "మొదటిది, అతనేవో సరుకులు కొనాలంటే మేమొకరోజు బజార్లో జనార్ధనగుప్త అంగడికెళ్లాం. అతను సరుకులు కట్టించుకున్నాక గుప్తాను దీక్షగా పైన్నుంచికిందికి చూసి "మీకు జీర్ణకోశ ఆరోగ్యం అంతబాగాలేదు, మీరుదాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అది తొందర్లోనే తీవ్రమయ్యే అవకాశముంది, వెంటనే సిటీకెళ్లి వైద్యం చేయించుకోండి" అన్నాడు. నేనూ,

గుప్తా నిర్ఘాంతపోయాము. ఆతరువాత గుప్తా హైదరాబాదెళ్తే రామస్వామి గుర్తించినదే నిర్ధారించబడి చికిత్స జరిగింది. అక్కడి డాక్టర్లుకూడా ఆశ్చర్యపోయారని గుప్తా చెప్పాడు”

"ఆసక్తికరంగానే వుంది. నీసమక్షంలో జరిగింది కాబట్టి నిజమే అయ్యుండాలి" అంది.

"యిక రెండోది విను. రామస్వామొకసారి మా ఆఫీసుకొస్తే మేం క్యాంటీన్ కెళ్లాము. మా పక్కసెక్షన్ ఆఫీసరు హాజాపీర్ మాయెదురుగా కూర్చోని కాఫీ తాగుతూ నాతో యేదో ఆఫీసు విషయం మాట్లాడాడు. అతను మంచి బ్యాడ్మింటన్ ఆటగాడు, వుత్సాహంగా వుంటాడు. రామస్వామి అతని మొహంకేసిచూస్తూ "మీ గుండె పరిస్థితి అంతబాగాలేదు. వీలైతే రేపే టౌన్లో కార్డియాలజిస్టుదగ్గరికెళ్లి చూపించుకోండి" అన్నాడు. హాజాపీర్ నమ్మకపోయినా యెందుకైనా మంచిదని మరుసటిరోజు కార్డియలజిస్టు దగ్గరికెళ్తే ఆయనా అదే చెప్పి వెంటనే చికిత్స మొదలుపెట్టాడట" అని ఆగాను.

“నిజమే. యీ యింట్యూషన్ అందరికీ వుంటుంది కానీ మన రోజువారిగోలల్లో అది మరుగునపడిపోతుందని యెక్కడో చదివాను" అంది కామేశ్వరి

“అంతెందుకు వొకరోజు వుదయాన్నే నేనూ, రామస్వామి నదివొడ్డునుండగా మనవీధి ‘పరోపకారి పాండురంగ’ అప్పుడే గుళ్లోనుంచి వచ్చి మమ్మల్ని పలకరించి మాకు ప్రసాదమిచ్చి యింటికి వెళ్తుంటే రామస్వామి వెనక్కిపిల్చి "మీ లివర్ లో చిన్న సమస్యవుంది. టౌనుకెళ్లి  పెద్దడాక్టర్ను కలవండి" అని చెప్పాడు. అతను పెద్దడాక్టర్ని కలిసొచ్చాక భార్య సుశీలతోసహా వెళ్లి  రామస్వామికి కృతజ్ఞత తెలిపాడు. ఇలాంటి సాక్ష్యాలు నేనేకాదు, యింకాకొంతమంది యివ్వగలరు. ‘యిదేదో మానవాతీత శక్తి కాదు, పూర్వకాలంనుంచి వైద్యుల్లో వున్నదాన్నే నేను పదునుపెట్టుకున్నాను అంటాడతను’. ఆతరువాత అతను బిజీఐపోయి యిక మేం తరచుగా కలవడం తగ్గిపోయింది. అదీ పూర్తికథ" అని కళ్లుమూసుకుని పడుకున్నాను.

"ఐతే యిందుకోసమన్నమాట, మీవాళ్లు రామస్వామికోసం తాపత్రయపడ్డం. రాయుడికి మొహంచెల్లక మూర్తివాళ్లని పంపాడు. అతను యిదివరకుచేసిన తప్పు తెలుస్తూనేవుంది. మీవాళ్లు సంప్రదాయం పేరుతో అందరి జుట్లూ పట్టి ఆడిస్తారు, యిలా తమవిషయానికొచ్చినప్పుడు కాళ్లబేరానికొస్తారు" నిరసనగా అని తనూ నడుంవాల్చింది కామేశ్వరి.

మరుసటిరోజు పొద్దున్నే నేనూ చలపతి ట్యాక్సి మాట్లాడుకుని బయల్దేరి రామస్వామివాళ్ల వూరెళ్లాం. మేం ముందుగా ఫోన్ చేసివుండడంవల్ల అతను మా భోజనాలు వాళ్లింట్లోనే ఏర్పాటు చేసాడు. భోజనాలయ్యాక అసలు విషయం అతనికి చెప్పాము. అతను ఒప్పుకోలేదు.

"నాకు మీవీధికి రావడమే యిష్టంలేదు. రాయుడింటిగ్గాని, మీ సంఘ పెద్దలిళ్లగ్గాని యింకెలావస్తాను?" అన్నాడు.

"వాళ్లు బతిమాల్తున్నారు గాబట్టి వస్తే వాళ్లకు బుద్ధిచెప్పినట్టుంటుందిగదా" అన్నాను.

అతను అడ్డంగా తలవూపి "నాకటువంటి పంతాలు, పట్టింపులు లేవు" అన్నాడు

"డాక్టరుగా వొక పేషంటును చూడ్డానికి రావచ్చుగదా" అన్నాడు చలపతి.

అతను కొంతఆలోచనలో పడ్డాడు. మళ్లీ యిద్దరం కొంతసేపు నచ్చజెప్పాక తనతోపాటు నేనూ, చలపతికూడా రాయుడింటికి రావాలన్న షరతుతో వొప్పుకున్నాడు.

"మరొకదానిక్కూడా నువ్వొప్పుకోవాలి. వాళ్లు యిప్పుడు యిండస్ట్రియలిస్టులైనా పూర్వపు జమిందారీ ఫాయిదా యింకా వుందట. తెలియని పురుషులదగ్గర ఆడవాళ్లు ఘోషా పాటిస్తారట. కిటికీకి తెరకట్టి ఆమె అవతల కూర్చుంటుందట, నువ్విటువైపు కూర్చుని రోగనిదానం చెయ్యాలట" అన్నా ఏమంటాడో అని కొంచెం సందేహిస్తూ.

రామస్వామి పకపకా నవ్వాడు. "రోగిని వైద్యుడు నిర్వికారంగా మానవత్వంతో చూస్తాడని వాళ్లకు తెలిసినట్టులేదు. అమె నాడి ఐనా చూడాల్సొస్తుంది మరి. దానికి సమ్మతమైతే వస్తాను. కనుక్కుని ఫోన్ చెయ్యి. నాకు వొకరోజు ముందు చెప్తే చాలు" అన్నాడు. అతనికి ధన్యవాదాలు చెప్పి నేను, చలపతి వాపసు బయల్దేరాం.

" రాయుడువాళ్లకి ఘోషాకి నిజమైన కారణాలు వొకటి భయం, రెండోది మనుషులను వేరుగాచూసే తత్వం" అన్నాడు చలపతి దారిలో.

రాగానే నారాయణమూర్తిని కలిసి రామస్వామి ఒప్పుకున్నాడని చెప్పి అతను పెట్టిన నాడి నిబంధన చెప్పాను. యిద్దరం రాయుడిగారి దగ్గరికెళ్లి విషయం చెప్పాము. రాయుడు లోపలికెళ్లి అతని తోడల్లుడితో ఫోనులో మాట్లాడి తిరిగొచ్చి "సరే రమ్మనండి. వాళ్లు కారులో రేపు బయల్దేర్తున్నారు. యెల్లుండి పొద్దున రామస్వామిని రమ్మనండి" అన్నాడు.

రామస్వామికి నేనీవిషయం ఫోన్లో చె ప్పాను, సరేనన్నాడు.

మూడోరోజు పొద్దున్నే రామస్వామి మాయింటికొచ్చాడు. ఫలహారం చేసాక ట్యాక్సిని వెనకాలే రమ్మని నేను, చలపతి అతను నడుస్తూ రాయుడుగారిబంగళాకు వెళ్లాం. వీధిలో ఎప్పటిలాగే జనం పల్చగావున్నారు. దూరంగా నదికవతల మూసేసిన జూట్ ఫ్యాక్టరి ప్రతిబింబం నదినీళ్లలో నల్లగా కనబడుతూంది. నదివొడ్డునున్న మార్కండేశ్వరాలయంనుంచి వస్తున్న భక్తులు చెట్లనీడలలో రామస్వామిని పరీక్షగాచూస్తూ గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తున్నారు.

అతను వూరొదిలివెళ్లాక యీ పదిహేనేళ్లలో నాలుగైదుసార్లు మాయిళ్లకొచ్చాడుగాని, అవిదాటి ఇటువైపు రాలేదు. అతను ఆస్పత్రి నడిపిన పెంకుటిల్లు దాటుతున్నప్పుడు అతనివైపు చూసాను. మొహంలో ఏభావమూ కనపడలేదు. అతన్ని పలకరిస్తున్నట్టుగా ఆయింటిముందున్న కొబ్బరిచెట్లు గాలికివూగాయి. అక్కడేవున్న ఒక ముసలికుక్క తోకవూపుతూ మావెనకాలే వచ్చింది.

రాయుడిగారి బంగళాలో మమ్మల్ని హాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ రాయుడుగారు, నారాయణమూర్తి ఉన్నారు. వాళ్లు రామస్వామిని తెచ్చిపెట్టుకున్న ఆప్యాయతతో పలకరించారు. రామస్వామి వాళ్లకు ముక్తసరిగా సమాధానమిచ్చాడు. మేం సోఫాల్లో కూర్చున్నాం. ఖరీదైన షేర్వాణి ధరించిన ఒక పొడవైన చామనచాయరంగు వ్యక్తి లోపల్నుంచి వచ్చాడు. అతన్ని 'తన చిన్నతోడల్లుడు, పారిశ్రామికవేత్త 'దేవరాజ్'' అని రాయుడుగారు మాకు పరిచయం చేసారు. సాధారణమైన మనిషిలాగ కనిపిస్తున్న రామస్వామిని చూసి అతను కొంచెం నిరుత్సాహపడినట్టు నాకనిపించింది. రామస్వామి మొహంలోవున్న సునిశితత్వం అతని మొహంలో లేదు, దుస్తులు, ఆభరణాల హడావుడి తప్ప.

అతను తనభార్య జబ్బువివరాలు, డాక్టర్లు మొదట్లో చెప్పగా వాడుతున్న మందులు ఇంగ్లీషులో, తెలుగు కన్నడం కలసిన భాషలో రామస్వామికి చెప్పాడు.

రామస్వామి మరికొన్ని జబ్బుకు సంబంధంలేని వివరాలడిగి తెలుసుకున్నాడు. అందరికీ అది కొంచెం వింతగా అనిపించింది. తను పేషెంటు నాడి చూడకతప్పదన్నాడు రామస్వామి. దేవరాజ్ లోపలికెళ్లి ఐదునిముషాల తర్వాత బయటికొచ్చి హాలుకు పక్కగదికి మధ్యవున్న కిటికిదగ్గర ఒక కుర్చీ వేయించాడు. ఆ కిటికీకి అవతలివేపు కనిపించకుండా రెండుపొరల దళసరి సిల్కుతెర ఉంది.

దేవరాజ్ రామస్వామిని ఆకుర్చీలో కూర్చోబెట్టి పక్కన నిలబడి కిటికీగుండా అవతలి గదిలోకి కన్నడంలో ఏదో చెప్పాడు. అప్పుడు కిటికీ తెరలోంచి ఒక పచ్చని చెయ్యి బయటికొచ్చింది. రామస్వామి ఆచేతిని అరనిముషం పట్టుకునిచూసి వదిలేసి "యీమె పేషెంటు కాదు. యీమెకేజబ్బూ లేదు" అన్నాడు కొంచెం కోపంగా లేచి.

వెంటనే దేవరాజ్ అతనికి క్షమాపణలు చెప్పి "మీరెలా చూస్తారో తెలుసుకోవడానికి మణిప్రభ సహాయకురాలు మొదట తనచెయ్యి చూపించుకుంది. యిది మా జమిందారీ సాంప్రదాయం. మరోలా అనుకోకండి" అని రామస్వామిని బతిమాలాడు. రాయుడుగారు కూడా లేచివెళ్లి రామస్వామికి నచ్చజె ప్పి కూర్చోబెట్టి, కిటికీవైపు కన్నడంలో ఏదో చెప్పాడు.

ఈసారి ఒక తెల్లని చెయ్యి కిటికీతెరలోంచి బయటికొచ్చింది.

రామస్వామి ఆచెయ్యిని ఒక నిముషం పరీక్షగాపట్టుకుని వదిలేసి లేచినిలబడి దేవరాజ్ నుద్దేశించి "వారికి జబ్బేమీలేదు. శరీరంలో మామూలుగాజరిగే ప్రక్రియకు అనుకోని ఆటంకం కలిగింది. నలభైయెనిమిది గంటల్లోపల వారికి నెలసరి అయిపోయి జ్వరం దానంతకదే తగ్గిపోతుంది. మందులేమీ అవసరంలేదు. యిప్పుడు వాడుతున్న మందులు వెంటనే మానేయండి. పండ్లు, పాలు, సులభంగా జీర్ణమయ్యేవి యేవైనా తినచ్చు. విశ్రాంతిగావుంటే చాలు" అన్నాడు.

దేవరాజ్ నోరుతెరుచుకుని అట్లాగే చూస్తూవుండిపోయాడు. రామస్వామి మాటలు విన్నట్టుగా కిటికీఅవతల మనుషులు కదిలినట్టు అలికిడైంది.

"అంతేనా?" అన్నాడు చివరికి దేవరాజ్ నోరు పెగుల్చుకుని

"అంతే. యెల్లుండి పొద్దునకి వారు మామూలుమనిషి కాకపోతే నాకు కబురు చెయ్యండి. ఆ అవసరం రాదనుకోండి" అని మావైపుచూసి వీధితలుపువైపు నడిచాడు రామస్వామి.

నేను, చలపతి లేచి అనుసరించాము. మూర్తి ఏదోచెప్తూ మావైపు రాబోయాడు. “ఆగండి రామస్వామిగారు” అని రాయుడుగారు ముందుకొచ్చారు. ఆయనచేతిలో ఒక పెద్ద బహుమతి అట్టపెట్టె ఉంది. దాన్నిచూసి రామస్వామి ఒక నమస్కారంతో వారించాడు.

వెనకాల్నుంచి "ఆగండిసార్, డాక్టరుసాబ్" అంటూ దేవరాజ్ చెక్కుబుక్కు తెరిచి పట్టుకుని పెన్నుతో వస్తున్నాడు. రామస్వామి ఆయనకూ ఒక నమస్కారం చెప్పి బయటికి నడిచాడు. మేమూ అతన్తో వచ్చేసాము.

“మీయిళ్లకు మరోసారెప్పుడైనా తీరిగ్గా వస్తాను, హాయిగా కాస్సేపు మాట్లాడుకుందాం. యిప్పుడొచ్చిన పని వేరు, వెళ్లొస్తా” అని నాతో, చలపతితో చెప్పి నవ్వుతూ ట్యాక్సియెక్కి వెళ్లిపోయాడు డాక్టర్ రామస్వామి.

బయటికిదెలా తెలిసిందో, ఆరోజునుంచి రామస్వామికి ‘నాడీ వైద్యుడు’ అనే పేరొచ్చింది.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments